# ఏకైక మామిడి పండు

ఏకైక మామిడి పండును తెచ్చి బల్ల మీద పెట్టి 'ఆరగించండి' అని వినయంగా చెప్పి తలుపుచాటుకు వెళ్ళి నిలుచున్నాను. మావారు దాని కేసి చూసి 'నీకో' అన్నారు. "నాకు వద్దులెండి" అన్నాను వినయంగా- "సయించదా? అన్నారు. "సయించకేం-బాగానే సయిస్తుంది." మరేవిటి రోగం అన్నట్లు చూశారు. "ఒకే పండు కదా అని మీకు సమర్పించాను. అన్నా.

"ఎవరిచ్చారు?'' అని ఎంక్వయిరీ ప్రారంభించారు. ఋషి ఎవరయినా తెచ్చి యిచ్చారేమో—ఆ పండు కంటే పుత్రకామేష్టిలో యిచ్చిన ఫలంలాటిదయితే తిన్నవారికి పండంటి పిల్లలు పుడతారు కనుక — అటువంటి ప్రమాదం వున్న పండేమోనని మావారి శంక అయివుండొచ్చు. అందుకని నేను నవ్వాను. ఆ పండు రెండు చేతులలో పుచ్చుకుని మూతి చేర్చి రసం జుర్రుతూంటే కళ్ళారా చుద్దామని నా తాపత్రయమని చెప్పాను. సవ్యంగా, ఎవరిచ్చింది. ఎక్కడ్నుంచొచ్చింది అని ఆరాలు తీయటం ప్రారంభించారు. మొన్న ఊరగాయ కాయ కొన్నప్పుడు ఒకకాయ ఎలా పడిందో బియ్యపు గబ్బాలో పడిందనీ దాన్నివాళ "కనుగొంటినీ శ్రీరామునీ నేడూ" అన్నట్లు కనుగొంటినీ తాము నిర్భయంగా ఆరగించవచ్చునీ మనవి చేశాను. "మరి నీకో" అన్నారు. నేను చూస్తాను. 'కాదు మనిద్దరం తిందాం" అన్నారు. సరే అలాగే కానివ్వండి-ముందు మీరు కొరుకుతారా అని ముచిక దగ్గర గిల్లి జీడి రసాన్ని పిండబోయాను. ఇంతలో 'తలుపు

తలుపు" అని ఎవరోవచ్చి దబదబా బాత్తున్నాడు. మంచి రసకందాయపు వేళ వచ్చారెవరో అని విసుక్కుంటూ తలుపు తీద్దును కదా—మా గాంధీ బాబయ్య వచ్చాడు. చచ్చంరా అని లోపల అనుకుని అంతా కులసా—ఎక్కడ నుంచి రావటం" అని అడిగాను. మేకపాలు, నిమ్మకాయ రసం, వేరుశనగ పలుకులు, అరటిపళ్ళు తేవాలిసొస్తుందని మావారు వెర్రిమొహం పెడుతున్నారు.



పెట్టకండి అని వారించి ఏకైక మామిడి పండును. "బాబయ్యా ఇంద తీసుకో అని యివ్వబోయాను. ఇంటికి రాగానే మామిడిపండు యివ్వటం వలన ఆయనకు అనుమానం కలిగింది. కూర్చుని ఆ మామిడిపండుకేసి అహింసాత్మకమైన చూపుల్ని బరపి దాన్నక్కడే వుంచి అమ్మాయీ— అని వేరుసెనగకాయలు బల్ల మీదపోశాడు "వలిచిపెట్టమని. మావారూ నేనూ మోస్టా బీడియంట్లలా అవి చిటుకు చిటుకుమనిపిస్తూ గింజలు వలిచి ఓ న్యూస్ పేపరుమీద పోస్తున్నాము. మా గాంధీ బాబయ్య చెప్పాడు—"మామిడిపండు

తినటం వలన హింస జరుగుతుంద"ని తన అభిప్రాయంట అదెల్లాగన్నారు మావారు.

"మీరు కలిసి తిందామని ఆ పండు తెచ్చి బల్ల మీద పెట్టుకున్నారు. అంచేత ఆ పండు నేనుతింటే మీదంపతులకు క్షోభ కలిగించినట్లవుతుంది. ఆ పండు మీరే తినండి. నాకు ఓ గ్లాసుడు మేకపాలు మాత్రం చాలు— తెప్పించండి-స్నానం చేసొస్తా" అని నూతి దగ్గరకి వెళ్ళి చేదతో నీళ్ళు తోడి దిమ్మరించుకోవటం ఆరంభించాడు. మావారు పళ్ళు పటపటలాడిస్తున్నారు. "పళ్ళు పటపట లాడించకండి వెళ్ళి మేకపాలు పట్రండి" అని గాజుగ్లాసు యిచ్చా. ఇప్పుడు మేకపాల కోసం నన్ను వీధిలోకి తోలడం మాత్రం హింసకాదా అని మావారు గింజుకొంటూ బుష్‌షర్టు ధరించి లుంగీ పైకి బిగించి చెప్పుల్లో కాళ్ళు దూర్చి టకటకాయ మానంగా విరసంగా చప్పుళ్ళు చేస్తూ బయటకు నడిచారు.

ఇంతలో మళ్ళీ తలుపుమీద టకటకమని మ్రోగింది, వెళ్ళి తలుపు తీసిచూద్దును గదా కారమార్క్సు గారొచ్చారు. కారల్‌మార్క్సు గారంటే నిజంగా కారల్‌మార్క్సుగారు కాదు. మార్కండేయశర్మగారని మావారి మేనత్త ఆడబడుచు తోటకోడలు మరిదిగారొచ్చారు. అయిన్ను మావారు కారల్‌మార్క్సుగారని అంటారు. ఆయన మార్క్సిస్టు రండిరండి కూర్చోండి అని "మావిడిపండు తింటారా" అన్నాను! ఆయన నవ్వాడు. కూర్చుని పండుకేసి అదోలా చూశాడు-

ఈ వర్గ సమాజంలో గుత్తపెట్టుబడిదారీ భూస్వామ్యర్గాల తోటలో పండిన బూర్జువా మామిమిడిపండును తింటానా?'' అన్నట్లు చూసి "అన్నగారులేరా" అన్నాడు. అన్నగారిని తింటారా అందామనిపించింది.

"రైతు కూలీ ప్రజానీకం చెమటోడ్చి పండించిన ఫలం- ఈ పండును తింటే వారి ఘర్మ జల ఫలితాన్ని జుర్రినట్లే—" అనుకుని తల పంకించి "మామిడి పండు వద్దమ్మా" అని ఏదో మీటింగు తాలుకు కరపత్రాలిచ్చి యివి ఆయన కందజేయమని వెళ్ళి పోయాడు. వంటింట్లో కెళ్ళి బాబయ్య కోసం చిక్కని మజ్జిగ చేస్తూ వుండిపోయా. మళ్ళీ

తలుపుమీద టకటకమని ఎవరో కొడుతున్నారు. వీధి గుమ్మం దగ్గర కెళ్ళి తలుపు తీశా— ఒక కుర్ర విప్లవకవి వచ్చాడు. "ఆంకుల్ వున్నారా" అంటూ— ఎండలో కుర్రాడి మొహం చెమటలు కక్కుతోంది. మంచి నీళ్ళు అడిగేందుకు కూడా సిగ్గుపడుతున్నాడు. ఈ అబ్బాయి ఇంజనీరింగు విద్యార్థి-మా వారికి స్నేహితులబ్బాయి, డిగ్రీ వచ్చినా ఉద్యోగం రాదని తెలుసుకుని విప్లవ కవిత్వం ప్రాక్టీసు చేస్తున్నాడు. మంచినీళ్ళిచ్చి మామిడి పండు తింటావా అని అడిగా— ఆ అబ్బాయి తల అడిస్తూ "వద్దండీ అత్తగారూ— విప్లవం వచ్చేదాకా మామిడి పండు వద్దండి ముందు ఈ వ్యవస్థ మారాలి" అన్ని వెళ్ళిపోయాడు."

మళ్ళీ ఎవరొస్తారో తలుపు తడితే యిటూ అటూ పరిగెత్త లేక కాళ్ళరిగి పోతాయని— మంచి నీళ్ళ కూజాతోసహా వీధి గదిలో కూర్చున్నా తలుపు తోసుకుంటూ నక్సలైటు సానుభూతి పరుడొకాయన "సిస్టర్ బ్రదరున్నారా" అంటూ వచ్చారు. మంచినీళ్ళిచ్చి "మామిడిపండు పుచ్చు కోండి." అన్నా చాలా డల్‌గా. "అమ్మమ్మ సాయుధ పోరాటం వల కాని మామిడి పండును తింటం కుదర్దు. వద్దు వెళ్ళొస్తా— ఈ పుస్తకాలు మీవారి కివ్వండి. చదవమన్నానని చెప్పండి." అంటూ నిష్క్రమించాడు.

నేను కళ్ళు మూసుకున్నాను. మామిడిపండు గురించి ఆలోచిస్తూ- మగత కమ్మింది. కలా కాదు. తెలివీ వున్నట్లుకాదు. కొత్త కాంగ్రెసువాది వచ్చాడు. "తినవయ్యా మామిడిపండు" అన్నా-

ఇస్మాయిల్‌గారు క్రమశిక్షణచర్య తీసుగుంటార"ని నసిగాడు. "ఫరవాలేదు మామిడి పండేగదా- అన్నాను. ఇందిరా గాంధిగార్నడగాలి అన్నాడు. గెటవుట్ అని లోపల్నే అనుకుని. జనసంఘీయుడ్ని ఆహ్వా నించాను—పాకిస్తాన్‌కు ఎటువంటి హామీలు యివ్వకుండా వారితో నిష్క ర్షంగా వ్యవహరించనిదే— శిఖరాగ్ర చర్చలలో భుట్టోతో తీవ్రంగా వ్యవహరించనిదే మామిడిపండు తినజాలనన్నాడు. సరే పొమ్మని వెనుక బడ్డ వర్గాల నాయకుడ్ని ప్రశ్నించాను. అంబేద్కరు ఏ ఆశయాల కోసం పోరాటం సలిపాడో వాటి సాధనలో రాజ్యాంగపు హద్దుల్లో నిమ్నజాతుల

వారికి సరయిన రక్షణ కల్పించేవరకూ మామిడిపండు తినే అర్హత లేద న్నాడు. రైతు కమ్యూనిస్టుని అడిగాను. మామిడిపండు తినటానికి సాయుధ పోరాటం అవసరంలేదు. పార్లమెంటరీ నినాదాల ద్వారా శాంతియుతంగా తినొచ్చు. మా కమిటీలో చర్చించి చెబుతానుండండి అన్నారు. కూజా ధామ్మని పడి నీళ్ళు నామీద చిందినాకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూశాను.

మా లాస్ట్‌బిట్‌వన్ స్కూల్నుంచి వచ్చినట్లున్నాడు. బల్లమీద మామిడిపండును చీకుతూ నాకు కనిపించాడు. నాకు కలిగిన రాజకీయమైన సిద్ధాంత పరమైన ఆందోళన లోపల సమసిపోయింది. మావో చెప్పినట్టు పోరాటాన్ని శత్రువే నిర్ణయిస్తాడు. మామిడి పండు భవిష్యత్తు మామిడి పండు తినేవాడి చేతిలోవుంది. పండు పండుమీదా తినేవాడిపేరు రాసుం టుంది మన తిరీ ప్రకారం.